క్లుప్తంగా

వరి చేల పరిశీలన



కోలమూరులో రైతులకు సూచనలు చేస్తున్న వ్యవసాయాధికారి భీమరాజు

రాజమహేంద్రవరం రూరల్: మండలంలో రైతులు 1,364 హెక్టార్లలో వరి సాగు చేయగా 1,238 హెక్టార్లలో కోతలు పూర్తయ్యాయని మండల వ్యవసాయాధికారి భీమరాజు తెలిపారు. 126 హెక్టార్లలో వరి కోతలు జరగాల్సి ఉందన్నారు. భారీ వర్షాలతో కొంతమూరు, కోలమూరు గ్రామాల్లో ముంపునకు గురైన వరి చేలను వ్యవసాయాధికారుల బృందం మంగళవారం పరిశీలించింది. రైతులకు పలు సూచనలు చేశారు. 153 హెక్టార్లలో వరి పంట నేలకు ఒరిగిపోయినట్లు గుర్తించామని భీమరాజు తెలిపారు. నూర్చిన ధాన్యాన్ని మిల్లులకు పంపే ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. వ్యవసాయ విస్తరణాధికారులు పీటర్, వేణు మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

సాయిల్ హెల్త్ కార్డుల పంపిణీ

కడియం: వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని దుళ్ల గ్రామంలో ఐసీఏఆర్ కేంద్ర పొగాకు పరిశోధన సంస్థ ఆధ్వర్యాన రైతులకు మంగళవారం సాయిల్ హెల్త్ కార్డులు పంపిణీ చేశారు. కలవచర్ల కృషి విజ్ఞాన కేంద్రం అధిపతి డాక్టర్ వీఎస్‌జీఆర్ నాయుడు, అధికారులు విజయ వర్ధన్, ప్రభాత్ నాయుడు తదితరులు నేల సారాన్ని కాపాడుకోవాల్సిన అవసరాన్ని రైతులకు వివరించారు. ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ జ్యోతిర్మయి, సర్పంచ్ కొండపల్లి పట్టియ్య, ఉద్యాన అధికారి సుధీర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులను చైతన్యపరిచేలా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

యోగా, ధ్యానంతో ప్రశాంతత

కడియం: యోగా, ధ్యానంతో మానసిక ప్రశాంతత లభిస్తుందని రాజస్థాన్‌లోని మౌంట్ అబు రాజయోగిని బీకే మంజుదేవి అన్నారు. మాధవరాయుడుపాలెంలోని ఈశ్వరీయ విశ్వ విద్యాలయాన్ని ఆమె మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అందరూ బాగుండాలన్న ఉద్దేశం మనలో ఉండాలని అన్నారు. వందసార్లు ప్రేమగా మాట్లాడినా, ఒక్కసారి ద్వేషంగా మాట్లాడితే ఎక్కువగా గుర్తుంటుందని చెప్పారు. తాను చేసిన కర్మల నుంచి మనిషి పారిపోలేడన్నారు. మంజుదేవిని సర్పంచ్ అన్నందేవుల చంటి తదితరులు ఘనంగా సత్కరించారు.

ట్రాక్టర్ డ్రైవర్‌కు 6 నెలల జైలు

కడియం: నిర్లక్ష్యంగా వాహనాన్ని నడిపి, ఒక మహిళ చేయి పోవడానికి కారణమైన ట్రాక్టర్ డ్రైవర్ పేపకాయల గోపాలానికి రాజమహేంద్రవరం ఏడో అదనపు జిల్లా జడ్జి పి.బాబు ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ మంగళవారం తీర్పు చెప్పారు. కడియం ఇన్‌స్పెక్టర్ జీవీజీ తిలక్ స్థానిక విలేకరులకు ఈ వివరాలు తెలిపారు. 2019 ఫిబ్రవరి 15న ఆలమూరు మండలం సంధిపూడికి చెందిన జి.సీతామహాలక్ష్మి వ్యానులో ప్రయాణిస్తోంది. కడియం మండలం దుళ్ల శివార్లకు వచ్చేసరికి పేపకాయల గోపాలం ట్రాక్టర్‌పై తాటి దుంగలు వేసుకుని వస్తున్నాడు. వ్యాన్‌ను రాసుకునేలా తన ట్రాక్టర్‌ను నిర్లక్ష్యంగా నడిపాడు. దీంతో చేతికి దుంగలు తగిలి సీతామహాలక్ష్మి తీవ్రంగా గాయపడింది. వైద్యులు ఆమె చేతిని తొలగించారు. ఈ ప్రమాదంపై అప్పటి కడియం ఎస్సై శ్రావణిదేవి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేశారు.

బాలరాజుకు పితృవియోగం



శ్రీరంగం సత్యనారాయణ (పాత చిత్రం)

ధవళేశ్వరం: వైఎస్సార్ సీపీ నాయకుడు శ్రీరంగం బాలరాజు తండ్రి సత్యనారాయణ (70) మంగళవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. ధవళేశ్వరం లాక్‌లైన్ క్వార్టర్స్‌లోని నివాసం వద్ద ఉంచిన సత్యనారాయణ భౌతికకాయాన్ని వైఎస్సార్ సీపీ, టీడీపీ, జనసేన పార్టీల నాయకులు సందర్శించి నివాళులర్పించారు. స్థానిక హిందూ స్మశాన వాటికలో సత్యనారాయణ అంత్యక్రియలు సాయంత్రం నిర్వహించారు. పితృ వియోగంతో బాధ పడుతున్న బాలరాజు, కుటుంబ సభ్యులను పలువురు నాయకులు పరామర్శించి ఓదార్చారు.

9 నుంచి కులగణన సర్వే

రాజానగరం: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 9 నుంచి మండలంలో కులగణన సర్వే నిర్వహిస్తామని ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎం.సుబ్రహ్మణ్యం తెలిపారు. గ్రామ గ్రామాన జరిగే ఈ సర్వేను పూర్తి పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. సర్వే ప్రక్రియపై ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులకు అవగాహన కల్పించేందుకు స్థానిక మండల ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, రాష్ట్రంలో మొదటిసారిగా 1931లో కులగణన సర్వే జరిగిందన్నారు. సర్వే జరిగే విధానం, ప్రాధాన్యం తదితర అంశాలను వివరించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ కోడి రాఘవ, ఎంఈఓలు రామన్నదొర, జ్యోతి ప్రసాద్, వైఎస్సార్ సీపీ మండల మాజీ కన్వీనర్ మందారపు వీర్రాజు, నాయకుడు వేమగిరి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



ఎల్ఐసి కార్యాలయం వద్ద మొక్కలను తొలగిస్తున్న అగ్నిమాపక సిబ్బంది



గాలులకు నేలకొరిగిన తోపుడు బండి



ఎల్ఐసీ కార్యాలయం వద్ద నేలకొరిగిన బోర్డులు



మోరంపూడి జంక్షన్ - వీఎల్ పురం రోడ్డులో విరిగి పడిన చెట్లు

సుడిగాలి బీభత్సం

- హడలెత్తిన రాజమహేంద్రవరం
- కూలిన చెట్లు, హోర్డింగులు, విద్యుత్ స్తంభాలు
- తక్షణ సహాయక చర్యలు చేపట్టిన అధికారులు

రాజమహేంద్రవరం రూరల్/రాజమహేంద్రవరం సిటీ: మిచాంగ్ తుపాను ప్రభావంతో మంగళవారం ఉన్నట్టుండి ఒక్కసారిగా చెలరేగిన సుడిగాలి పెను బీభత్సం సృష్టించింది. మధ్యాహ్నం సుమారు 1.50 గంటల సమయంలో మోరంపూడి జంక్షన్‌తో పాటు నగరంలోని పలు ప్రాంతాల్లో గాలి ఒక్కసారిగా మినీ టోర్నడో మాదిరిగా సుడులు తిరుగుతూ పరిసర ప్రాంతాలను అతలాకుతలం చేసింది. అరగంట పాటు సాగిన సుడిగాలుల బీభత్సంతో నగర ప్రజలు భయకంపితులయ్యారు.



వీఎల్ పురంలోని 25, 26 వార్డు సచివాలయంలో ఎగిరిపోయిన రేకులు



నగరంలోని కాలువలను పరిశీలిస్తున్న వైఎస్సార్ సీపీ నేత డాక్టర్ గూడూరి శ్రీనివాస్

మోరంపూడి జంక్షన్ సమీపాన సుడిగాలి తాకిడికి ఎల్ఐసీ కార్యాలయం, పాత లారీ స్టాండ్, పరిసర ప్రాంతాల్లోని ఉన్న భారీ చెట్లు నేలకొరిగాయి. చెట్లు విరిగి పడటంతో ప్రహరీలు ధ్వంసమయ్యాయి. ఎల్ఐసి కార్యాలయం బోర్డులు, 25, 26 వార్డు సచివాలయ భవనంపై రేకులు గాలికి ఎగిరిపోయాయి. అక్కడకు సమీపంలోని సుజుకీ షోరూములోని వర్క్‌షాపు షెడ్డు నేలకొరిగిపోయింది. ఆ సమయంలో భోజన విరామ సమయం కావడంతో సిబ్బంది ఎవ్వరూ లేరు. దీంతో పెద్ద ప్రమాదం తప్పింది. పలు వాహనాలు మాత్రం స్వల్పంగా దెబ్బతిన్నాయి. నగరంలోని పలు ఇతర ప్రాంతాల్లో కూడా సుడిగాలి బీభత్సానికి చెట్లు, హోర్డింగ్‌లు, షెడ్లు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. దీంతో ప్రజల రాకపోకలకు, విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. చెట్లు కూలిపోవడంతో వాటి కింద నిలిపి ఉంచిన కార్లు దెబ్బ తిన్నాయి. కొన్నిచోట్ల కాంక్రీట్ షెడ్లకు సైతం నష్టం వాటిల్లింది.

స్పందించిన అధికార యంత్రాంగం

సుడిగాలి విధ్వంసం సృష్టించిన నేపథ్యంలో నగరపాలక సంస్థ, అగ్నిమాపక శాఖ అధికారులు వెంటనే స్పందించారు. విరిగిపడిన చెట్లను వెంటనే తొలగించారు. మోరంపూడి జంక్షన్‌లో పలు చెట్లు నేలకొరగడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పిడింగొయ్యి గ్రామ పంచాయతీ పరిధిలోని బాపూజీ నగర్ జాడీల ఫ్యాక్టరీల రోడ్డులో నేల కూలిన చెట్లను పంచాయతీ అధికారులు వెంటనే తొలగించారు. ఏపీ ఈపీడీసీఎల్ సిబ్బంది తక్షణమే ప్రత్యేక బృందాలుగా ఏర్పడి, విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ పనులు

సుడిగాలి బీభత్సంతో దెబ్బ తిన్న ప్రాంతాల్లో జిల్లా కలెక్టర్ కె.మాధవీలత, నగరపాలక సంస్థ కమిషనర్ కె.దినేష్‌కుమార్ పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ చర్యలు చేపడుతున్నామని వారు తెలిపారు. తీవ్ర స్థాయిలో వీచిన గాలి, వర్షాలకు దెబ్బ తిన్న ప్రాంతాల్లో సహాయ, పునరుద్ధరణ పనులను వ్యక్తిగతంగా పరిశీలించి తగిన సూచనలు చేశామని కలెక్టర్ చెప్పారు. నగరపాలక సంస్థ, అగ్నిమాపక, విద్యుత్, రెవెన్యూ, ఆర్అండ్‌బీ, పోలీసు అధికారులు, సిబ్బంది తక్షణమే స్పందించి, పునరుద్ధరణ పనులు చేపట్టారని అన్నారు. మోరంపూడి జంక్షన్ వద్ద ప్రారంభమైన సుడిగాలి నగరంలోని వీఎల్ పురం, సోమాలమ్మ గుడి, పంచవటి హోటల్, దానవాయిపేట, టీటీడీ కల్యాణ మండపం, మహిళా కళాశాల మీదుగా ఈట్ స్ట్రీట్, కంటిపూడి రామారావు మునిసిపల్ పాఠశాల, లలితా నగర్, పేపర్ మిల్లు రోడ్డు మీదుగా గోదావరి నదిని దాటిందని వివరించారు. కంటిపూడి రామారావు మునిసిపల్ పాఠశాల ప్రాంగణంలో ఈదురు గాలుల వలన కలిగిన నష్టాన్ని కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ఈ గాలులు, వర్షాల వలన నగరంలో ఎటువంటి ప్రాణ, ఆస్తినష్టాలు జరగలేదని కమిషనర్ దినేష్ కుమార్ తెలిపారు. పెద్ద ఎత్తున చెట్లు నేల కూలాయని, వాటిని తొలగించి, విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇంటర్మీడియెట్ బోర్డు ప్రాంతీయ సంచాలకులు శారద, జిల్లా ఇంటర్మీడియెట్ అధికారి సుబ్రమణ్యం, నగరపాలక సంస్థ ఎస్ఈ జి.పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.



గాలి బీభత్సం సృష్టించిన ప్రాంతాలను పరిశీలిస్తున్న కలెక్టర్ మాధవీలత, కమిషనర్ దినేష్ కుమార్

గూడూరి పర్యటన

నగరంలో భారీ వర్షాలతో ముంపునకు గురైన సుడిగాలి బీభత్సం సృష్టించిన లింగంపేట, ఆదెమ్మ దిబ్బ, లలితా నగర్, కృష్ణా నగర్, ఆర్యాపురం తదితర ప్రాంతాల్లో వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ పర్యటించారు. స్థానికులతో సమన్వయం చేసుకుని వెంటనే ట్రాఫిక్ పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. విద్యుత్ స్తంభాలు విరిగి పడినచోట్ల తక్షణమే రక్షణ చర్యలు చేపట్టి, విద్యుత్ పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అరిగెల బాబు, లంక ప్రసాద్, బాలాజీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తుపాను వేగంతో స్పందన

- అన్నదాతలను ఆదుకునేందుకు తక్షణం కదిలిన ప్రభుత్వ యంత్రాంగం
- మిల్లులకు ధాన్యం తరలించేందుకు ఏర్పాట్లు
- స్వయంగా పర్యవేక్షించిన కలెక్టర్ మాధవీలత

కడియం: మిచాంగ్ తుపాను ప్రభావంతో పంటలు నష్టపోతున్న రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వ యంత్రాంగం తుపాను వేగంతో కదులుతోంది. ఇప్పటికే నూర్చి, కళ్లాల్లో ఉన్న ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటోంది. ఇంకా కోతలు పూర్తి కాని పంటను కాపాడుకునేందుకు రైతులకు అవసరమైన సూచనలు చేస్తోంది. ఈ పనులను జిల్లా కలెక్టర్ కె.మాధవీలత స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. దీంతో రెవెన్యూ, వ్యవసాయ శాఖల అధికారులు ఒకపక్క జోరు వాన కురుస్తున్నా ధాన్యం ఎగుమతులు చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు తేమ శాతంతో సంబంధం లేకుండా.. రైతులకు నష్టం కలగకుండా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని కలెక్టర్ మాధవీలత ఆదేశించారు. మండలంలోని మురమండలో ధాన్యం ఎగుమతులను మంగళవారం ఆమె స్వయంగా పర్యవేక్షించారు. కళ్లాల్లో ఉన్న ధాన్యాన్ని మొత్తం మిల్లులకు చేర్చాల్సిందిగా అధికారులను ఆదేశించారు. కడియం మండల పరిధిలోని రైసు మిల్లులకే ఇక్కడి ధాన్యం తరలించే విధంగా చర్యలు తీసుకున్నారు. కలెక్టర్ వెంట ఆర్‌డీఓ చైత్రవర్షిణి, తహసీల్దార్ ఎం.సుజాత, వ్యవసాయాధికారి కె.ద్వారకాదేవి, ఆయా శాఖల సిబ్బంది ఉన్నారు. ఇదిలా ఉండగా కడియపుసావరం, కడియం గ్రామాల పరిధిలో సుమారు 60 ఎకరాల్లో వరి పంట నేలకు ఒరిగిందని వ్యవసాయ అధికారులు తెలిపారు. ఒకటి రెండు రోజుల్లో వర్షాలు తగ్గుముఖం పడితే పంట నష్టం పెద్దగా ఉండకపోవచ్చని అన్నారు.

జిల్లా వ్యాప్తంగా పోలీసుల సహాయక చర్యలు

కంబాలచెరువు: ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు పోలీసులు జిల్లా వ్యాప్తంగా ముమ్మరంగా సహాయక చర్యలు చేపట్టారు. ఎప్పటికప్పుడు పరిస్థితులను ఆరా తీస్తూ, రెవెన్యూ, ఇతర శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ, తగిన చర్యలు చేపట్టాలని ఎస్పీ సూచించారు. ఈ మేరకు త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధి వై జంక్షన్, ప్రకాష్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధి దానవాయిపేట, కొవ్వూరు, చాగల్లు, తాళ్లపూడి పోలీస్ స్టేషన్ల పరిధిలో ఈదురు గాలులకు రోడ్లపై విరిగిపడిన చెట్లను, కరెంట్ స్తంభాలను వెంటనే తొలగించి, ట్రాఫిక్ అంతరాయం లేకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు. వర్షం కురుస్తున్న సమయంలో పాత భవనాలు, చెట్ల కింద, విద్యుత్ స్తంభాలున్న ప్రాంతాల్లో ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు ఎస్పీ జగదీష్ సూచించారు. ప్రయాణించేందుకు అనువు కాని మార్గాల్లో, నీట మునిగిన రహదారుల వద్ద పోలీసు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. అటువంటి రోడ్లను మూసివేసి, ఇతర మార్గాల్లో వాహనాలు వెళ్లేలా చర్యలు చేపట్టామన్నారు. అత్యవసర పరిస్థితుల్లో సహాయం కావలసిన వారు 100, దగ్గర్లోని పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందిస్తే, వెంటనే పోలీసు సిబ్బంది అందుబాటులోకి వస్తారని ఎస్పీ తెలిపారు.



మురమండలో ధాన్యం ఎగుమతులను స్వయంగా పర్యవేక్షిస్తున్న కలెక్టర్ మాధవీలత

జాగ్రత్తలతో నష్ట నివారణ

వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ టి.శ్రీనివాస్

రాజమహేంద్రవరం రూరల్: మిచాంగ్ తుపాను కారణంగా గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వేలాది ఎకరాల్లో వరి పొలాలు నీట మునిగాయి. ఈదురుగాలులకు పలు ప్రాంతాల్లో వరి చేలు నేలకొరిగాయి. చేతికంది వచ్చిన పంట కళ్ల ముందే నేలపాలైందంటూ అన్నదాతలు కన్నీరుమున్నీరవుతున్నారు. ఈ నేపథ్యంలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకుంటే తుపాను వల్ల జరిగిన నష్టాన్ని తగ్గించుకోవచ్చని మారుటేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త(వరి) డాక్టర్ టి.శ్రీనివాస్ చెబుతున్నారు. తడిసిన వరి పంట, ధాన్యాన్ని ఎలా కాపాడుకోవాలో రైతులకు ఆయన చెబుతున్న సూచనలివే..

- పంట కోసిన, పూర్తిగా ఆరని పనలను కుప్పలు వేసేటప్పుడు ఎకరాకు 25 కిలోల ఉప్పును పనలపై చల్లుకుంటూ కుప్ప వేసుకోవడం వల్ల నష్టాన్ని నివారించుకోవచ్చు.
- కోత కోసి పొలంలో ఉన్న పనలు వర్షానికి తడిస్తే గింజ మొలకెత్తకుండా ఉండడానికి 5 శాతం ఉప్పు ద్రావణాన్ని పనలపై పడేలా పిచికారీ చేయాలి. ఒక వేళ పొలంలో నీరు నిలిచి ఉంటే పనలను తిరగేసి ఎండబెట్టి నూర్చుకోవాలి.
- కల్లాల మీద ఉన్న ధాన్యాన్ని వర్షానికి తడవకుండా భద్రపరుచుకోవాలి. నూర్చిన ధాన్యం 2-3 రోజులు ఎండ బెట్టడానికి వీలు కాకపోతే కుప్పలలో గింజ మొలకెత్తడమే కాక రంగు మారి చెడు వాసన వస్తుంది. ఇటువంటి పరిస్థితుల్లో నష్టాన్ని నివారించడానికి ఒక క్వింటాలు ధాన్యానికి ఒక కిలో ఉప్పు, 20 కిలోల పొడి ఊక కలిపి ధాన్యం పోగు పెట్టడం వల్ల గింజ మొలకెత్తకుండా నివారించుకోవచ్చు. ఎండకాసిన తరువాత ధాన్యాన్ని ఎండబోసి, తూర్పారబట్టి నిలువ చేసుకోవాలి.
- రంగుమారి, తడిసిన ధాన్యం పచ్చి బియ్యం కంటే ఉప్పుడు బియ్యంగా అమ్ముకోవడం వల్ల నష్టాన్ని కొంత వరకు తగ్గించుకోవచ్చు.
- పొట్ట, పూత దశలో పైరు ఒకటి నుంచి రెండు రోజుల కన్నా ఎక్కువ రోజులు నీటమునిగితే కంకి పూర్తిగా బయటకు రాకపోవడం, తాలు, రంగు మారిన గింజలు ఏర్పడతాయి. గింజ రంగు మారకుండా ఉండటానికి లీటరు నీటికి ఒక గ్రాము కార్బెండిజం లేదా రెండు గ్రాముల కార్బెండిజం, మాంకోజెట్ లేదా 1 మి.లీ. ప్రొపికొనజోల్ మందును పిచికారీ చేయాలి.

అవసరానికి ఆదుకోవాలి

రాజమహేంద్రవరం సిటీ: సమాజంలో అవసరార్థులను ఆదుకోవడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని స్వర్ణాంధ్ర స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకుడు గుబ్బల రాంబాబు పిలుపునిచ్చారు. సంస్థ ప్రాంగణంలో మంగళవారం జరిగిన అంతర్జాతీయ స్వచ్ఛంద సేవా దినోత్సవంలో 100 మంది వృద్ధులు, నిరాశ్రయులకు పండ్లు, టాయిలెట్ కిట్, చలికాలం నుంచి రక్షణకు మఫ్లర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ, సహాయం చేయగలిగే స్థితిలో ఉన్నవారు, ఆర్థిక స్థితిమంతులు సమాజంలో వెనుకబడిన పేదవారికి చేయూతనిచ్చేందుకు ముందుకు రావాలని కోరారు. తమ సంస్థ గత 24 సంవత్సరాలుగా స్వచ్ఛంద సేవా సంస్థలకు దిక్సూచిగా ఉంటూ, నగరంలో ప్రతి రోజూ అన్నదానం చేయడంతో పాటు పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తోందని చెప్పారు. స్వర్ణాంధ్ర అన్నదానం 1,150వ రోజుకు చేరిందని, ఇందుకు సహకరిస్తున్న దాతలకు, సేవలందిస్తున్న స్వచ్ఛంద సేవకులకు రాంబాబు ధన్యవాదాలు తెలిపారు.



వృద్ధులకు కిట్లు అందిస్తున్న రాంబాబు

రైతులు నష్టపోకుండా చర్యలు

అనపర్తి: మించాగ్ తుఫాను నేపథ్యంలో రైతులు నష్టపోకుండా ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలు తీసుకుందని జేసీ ఎన్.తేజ్‌భరత్ తెలిపారు. మంగళవారం మండలంలోని దుప్పలపూడి, పొలమూరు గ్రామాల్లో క్షేత్రస్థాయిలో వరి పొలాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుఫాను కారణంగా రైతులు ఇబ్బందులకు గురికాకుండా ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్‌లోనూ యుద్ధ ప్రాతిపదికన ధాన్యం సేకరణకు చర్యలు తీసుకున్నామన్నారు. వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో రైతులు ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు, సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. రాసులుగా ఉన్న ధాన్యాన్ని తరలించేందుకు వాహనాలు ఏర్పాటు చేయడంతో పాటు తరలింపుకు హమాలీలను ఏర్పాటు చేయాలని వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించారు. జేసీ వెంట తహసీల్దార్ వై.సరస్వతి, ఏఓ బి.సురేష్‌కుమార్ తదితరులున్నారు.

తడిసి ముద్దయిన రాజమహేంద్రవరం



తుపాను ప్రభావంతో మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి రాజమహేంద్రవరం నగరం తడిసి ముద్దయ్యింది. వాన నీటితో జలమయంగా మారిన ఆదెమ్మ దిబ్బ ప్రాంతాన్ని చిత్రంలో చూడవచ్చు.

- సాక్షి, రాజమహేంద్రవరం

నాడు రూ.15 లక్షలే.. నేడు రూ.4.80 కోట్లు

- ఇదీ చక్రద్వారబంధం అభివృద్ధికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన ఖర్చు
- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా వెల్లడి
- గ్రామంలో జోరు వానలోనూ గడప గడపకూ కార్యక్రమం

రాజానగరం: 'చక్రద్వారబంధం గ్రామ అభివృద్ధికి గత టీడీపీ ప్రభుత్వం రూ.15 లక్షలు మాత్రమే ఖర్చు చేసింది. అదే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో గడచిన నాలుగున్నరేళ్లలోనే రూ.4.80 కోట్లు ఖర్చు చేశాం' అని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా తెలిపారు. గ్రామంలో ఆయన మంగళవారం రాత్రి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. జోరున వర్షం కురుస్తున్నప్పటికీ గొడుగు సాయంతో ఇంటింటికీ వెళ్లి ప్రజల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు వారి ముంగిటనే అందిస్తూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రజారంజకమైన పాలన అందిస్తోందని చెప్పారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని అన్నారు. వివిధ సమస్యలు పరిష్కరిస్తూ, గ్రామాల ప్రగతికి కోట్లాది రూపాయలు వెచ్చిస్తోందని, నియోజకవర్గంలోని గ్రామాల్లో రూ.వెయ్యి కోట్ల మేర అభివృద్ధి జరిగిందని తెలిపారు. అలాగే సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారులకు మరో రూ.వెయ్యి కోట్లు అందజేశామన్నారు. ఈవిధంగా అటు పేదలు, ఇటు గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని మరోసారి అధికారంలోకి తీసుకురావాలని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కోరారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించి, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి మరోసారి అధికారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దూలం పెద్ద, నాయకులు వాద్రేవు శ్రీనివాస్ కుమార్, నాగవరపు త్రిమూర్తులు, నీలపాల శివరామకృష్ణ, దుర్గా రమేష్, గుత్తుల చంద్రరావు, కురుమల్ల బాబీ, యాళ్ల నిరీక్షణరావు, ఎస్‌వీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

ఘనంగా ప్రపంచ మృత్తికా దినోత్సవం



మృత్తికా దినోత్సవంలో పాల్గొన్న శ్యామ్‌రాజు నాయక్ తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: కాతేరులోని వ్యవసాయ కళాశాలలో అసోసియేట్ డీన్ డాక్టర్ శ్యామ్‌రాజు నాయక్ అధ్యక్షతన మంగళవారం ప్రపంచ మృత్తికా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'నేల, నీరు జీవన విధానానికి ప్రధాన పాత్ర' అనే అంశంపై విద్యార్థినీ విద్యార్థులకు వివరించారు. నేల ఆరోగ్యాన్ని, నీటి ప్రాధాన్యాన్ని ఏవిధంగా కాపాడుకోవాలో వివరించారు. భూసార విభాగాధిపతి ప్రొఫెసర్ విజయశంకర్‌బాబు, డాక్టర్ ఉషారాణి ఆధ్వర్యాన నీటి కాలుష్యాన్ని ఎలా నివారించాలనే అంశాన్ని వివరించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు అనురాధ, దయాకర్, విజయకృష్ణ కుమార్, అమ్మాజీ, హైమజ్యోతి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు



శ్యామల	యానిమల్
రాజా	యానిమల్
అశోక	యానిమల్
రంభ	యానిమల్
అప్సర	యానిమల్
అనుశ్రీ	కాలింగ్ సహస్ర
సూర్యా ప్యాలెస్	కాలింగ్ సహస్ర
సూర్యా మినీ	పల్లెగూటికి పండగొచ్చింది
స్వామి	మంగళవారం
శివజ్యోతి	కోటబొమ్మాళి పీఎస్
ఊర్వశి	ఆదికేశవ
మేనక	అథర్వ
నామవరం	
వీఎస్ మహల్	యానిమల్
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	యానిమల్
కడియం	
వెంకట సూర్య	యానిమల్